కందాల అందాలు, తేటగీతి తీయదనాలు తెలిసిన సాహిత్యాభిలాషి. రసాత్మకమైన వాక్యాన్ని ప్రేమించే అక్షరాభిమాని. వెండితెరను ఎంతో ఇష్టపడతారు. మట్టిలో బంగారం పండించడానికి ఎంతైనా కష్టపడతారు. పాటల పూదోటలో విహరిస్తారు. ఖద్దరు దుస్తుల్లో దర్జాగా మెరిసిపోతారు. కళాత్మకంగా జీవించడం తెలిసిన మనిషి. రాజకీయ కళలో రాటుదేలిన ఉద్యమ నాయకుడు. కేసీఆర్ ఉత్తమాభిరుచికి అనేక ఉదాహరణలు..



# మెచ్చినవీ.. నచ్చినవీ..

## పద్యం

ఒకచో నేలను బవ్వళించు, నొకచో నొప్పారు బూసెజ్జపై,
నొకచో శాకము లారగించు, నొకచో నుత్కృష్ట శాల్యోదనం,
బొక్కచో బొంత ధరించు, నొక్కొక తఱిన్ యోగ్యాంబర శ్రేణి, లె
క్కకు రానీయడు కార్యసాధకుడు దుఃఖంబున్ సుఖంబున్ మదిన్

## పుస్తకాలు

**రాహుల్** సాంకృత్యాయన్ రచన 'ఓల్గా నుంచి గంగకు' అంటే కేసీఆర్‌కు ఎంతో ఇష్టం. క్రీస్తు పూర్వం 6000 సంవత్సరంలో ప్రజల వలస ప్రారంభం నుంచి మొదలుపెట్టి 1942లో గంగా తీరంలో స్వాతంత్ర్యోద్యమ ఘట్టం వరకు ఇండో యూరోపియన్ జాతి ప్రస్థానాన్ని సాంకృత్యాయన్ ఈ నవలలో అక్షరీకరించాడు. అంటే దాదాపు 8,000 సంవత్సరాల చరిత్ర నిక్షిప్తమై ఉందన్నమాట. కేసీఆర్ మెచ్చిన మరో పుస్తకం... డాక్టర్ ఇరివెంటి కృష్ణమూర్తి రచించిన 'వాగ్భూషణమ్ '. ఉపన్యాస కళలో రాణించాలనుకునే వారికోసం రాసిన ఈ పుస్తకం తనకెంతో నచ్చింది, తనను మంచి వక్తగా తీర్చిదిద్దిందని ఎన్నోసార్లు పేర్కొన్నారు. ప్రముఖ కథకులు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 'మార్గదర్శి' కేసీఆర్ మెచ్చిన కథల్లో ఒకటి.

## రంగులు

తెలుపు, మెరూన్ వర్ణాలు

## పాటలు

**రాజా** మెహ్దీ అలీ ఖాన్ రాసిన 'లగ్ జా గలే' పాట. ఈ గీతాన్ని 'వో కౌన్ థీ?' సినిమా కోసం లతా మంగేష్కర్ ఆలపించారు. ఇక ఎప్పటికీ కలవకుండా విడిపోతున్న ఇద్దరు ఆత్మీయుల వియోగ బాధను కవి అద్భుతంగా వ్యక్తీకరించారు. 'భక్త కన్నప్ప' చిత్రం కోసం వేటూరి రాసిన 'శివశివ శంకర భక్త వశంకర' పాట అన్నా కేసీఆర్‌కు ఇష్టమే. గౌరీభట్ల శ్రీనాథ శర్మ రచించిన 'ఉమాపార్థివ కోటి లింగేశ్వర/ హిమాద్రీశ సర్వేశ గంగాధరా...' అనే మంగళహారతి పాటకూ పరవశించిపోతారు.

## సినిమాలు

**జేమ్స్‌బాండ్** మూవీస్, షోలే, ఆరాధన, సాగర సంగమం, స్వాతి ముత్యంతో పాటు అమితాబ్ బచ్చన్, ఎన్టీఆర్, కృష్ణ నటించిన పాత సినిమాలను ఇష్టంగా చూస్తారు.

## వ్యాపకాలు

**కేసీఆర్‌కు** సేద్యం అంటే మక్కువ. తన వ్యవసాయ క్షేత్రంలో కలర్ క్యాప్సికం, ఆలుగడ్డ, అల్లం.. తదితర పంటలకు సంబంధించిన ప్రయోగాలూ చేశారు. వాణిజ్య పంటలపై అపార శ్రద్ధ చూపుతారు. కారు డ్రైవింగ్, చదరంగం అన్నా ఇష్టమే.

## షాపింగ్

**అబిడ్స్** మెట్రో ఫుట్‌వేర్, హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్ దగ్గర ఉన్న శ్రీసాయి ఖాదీ వస్త్రాలయంలో షాపింగ్ చేస్తారు. ఈ దుకాణంతో కేసీఆర్‌కు 50 ఏండ్ల అనుబంధం ఉంది.

